నీటిని వృథా చేయకండి

నీటి సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న విశ్రాంత హైడ్రాలజిస్ట్ సత్యనారాయణ

ఖైరతాబాద్, డిసెంబర్ 1 : ప్రజలు తమ నిత్య జీవితంలో నీటి వృథాను అరికట్టాలని విశ్రాంత హైడ్రాలజిస్ట్ జాలా సత్యనారాయణ సూచించారు. ఆదివారం నీటి సంరక్షణపై ఖైరతాబాద్ డబుల్ బెడ్రూం వద్ద ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. నీటి విలువ ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఒక్క రోజు నీరు రాకుంటే ఇబ్బంది ఎదురవుతుందో ప్రజలందరికి తెలుసునని, నీటి వృథా చేస్తే భావితరాలు ఇబ్బందులు పడుతాయన్నారు. బెంగళూరు, చెన్నై నగరాల్లో అదే పరిస్థితి నెలకొందని, అలాంటి ప్రమాదాలు తెలంగాణలో రాకుండా ఉండాలటే నీటివృథాను అరికట్టాలన్నారు. పెద్దలు తమ పిల్లలకు నీటి విలువపై అవగాహన కల్పించాలన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

బండ్లగూడ / మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 1: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ తెలిపారు. పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్ నం.134, శివరాంపల్లి 258, మొయినాబాద్ వద్ద ప్రమాద స్థలాలను గుర్తించి రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్‌తో కలిసి సందర్శించారు. ప్రమాదాలను అధిగమించడానికి, ట్రాఫిక్ సమస్యలను నిరోధించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలు వాహనాలను అతివేగంగా నడపడం వల్ల ప్రమాదాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయన్నారు. వీటి కారణంగా అనేక మంది తమ ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనాదారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, కార్లల్లో సీట్ బెల్ట్ తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. ట్రాఫిక్ పోలీసులు ప్రమాద స్థలాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో సూచిక బోర్డులతో పాటు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రజలంతా పోలీసులకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

అత్తాపూర్ వద్ద పరిశీలిస్తున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ, ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్

కార్తిక అమావాస్య పూజలు

మణికొండ వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంతో కార్యాలయం ఆవరణలో కార్తిక మాసం చివరి ఆదివారం అమావాస్య సందర్భంగా అన్నదానం చేశారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం వరకు జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, స్థానికులు, ప్రజలు పాల్గొన్నారు.

- మణికొండ

భక్తిశ్రద్ధలతో పూజలు

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో కార్తిక మాసం చివరి ఆదివారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో స్వామి వారికి అభిషేకం, పోచమ్మ ఆలయంలో అన్నదానం చేశారు. పూజల్లో మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేశ్, పోతురాజు మల్లేశ్ గురుస్వామి, నాగరాజు గురుస్వామి, శేఖర్, మల్లేశ్, జగన్, రాజ్‌కుమార్, ప్రవీణ్, సన్నీ, ఆనంద్, మూర్తి, వెంకటేశ్, శేఖర్, మోహన్ పాల్గొన్నారు.

- మైలార్‌దేవ్‌పల్లి

బలహీన వర్గాల గొంతుక .. బాలమల్లేశ్



బాలమల్లేశ్ పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

హిమాయత్‌నగర్, డిసెంబర్ 1 : నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి తుది శ్వాస వరకు సమాజానికి సేవలు అందించిన నిరాడంబర జీవి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేశ్ అని పలువురు వామపక్ష, రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు కొనియాడారు. వామపక్ష, ప్రజా ఉద్యమాలకు ఆయన లేని లోటు తీర్చలేనిదని అన్నారు.

ప్రజల సందర్శనార్థం హిమాయత్ నగర్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం ఆవరణలో బాలమల్లేశ్ పార్థివదేహం ఉంచారు. ఆదివారం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ చెరుకు సుధాకర్, పల్లె రవికుమార్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, డాక్టర్ బి.వి.విజయలక్ష్మి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈ.టి.నరసింహ, వి.ఎస్.బోస్, భాగం హేమంత్ రావు, ఎం.బాలనర్సింహ, కలవేణి శంకర్, ఏపీ సీపీఐ నాయకులు అక్కినేని వనజ, రామాంజనేయులు, మాజీ ఎమ్మెల్యే యాదగిరిరావు, మాజీ రాజ్య సభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, టీ పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోదండ రామ్, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వి.వెన్నెల, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య, డి.జి.నర్సింహ, టి.సాగర్, సీపీఐ ఎం.ఎల్. (న్యూడెమోక్రసి) నాయకులు భాస్కర్, మహేశ్ కుమార్, సీపీఐ ఎం.ఎల్ మాస్ నాయకులు ఎస్.ఎల్.పద్మ, రమ, నరహరి, ఎం.సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్, ఆర్ఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు, మాజీ ఎమ్మెల్సీ, ప్రొ. కె.నాగేశ్వర్,ప్రొ. ఖాసీం, ఎస్.వి.సత్యనారాయణ, సినీ దర్శకుడు బాబ్జీ, పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య, ప్రజా గాయకుడు ఏపూరి సోమన్న, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి.యూసుఫ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశ్, ఉపాధ్యక్షురాలు పి.ప్రేం పావని, సీపీఐ నగర కార్యదర్శి ఎస్.ఛాయదేవి, పల్లె నరసింహ, సబ్బు రాజమౌళి, ప్రజాపక్షం ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ బొమ్మగాని కిరణ్, అసిస్టెంట్ ఎడిటర్ ఈ.చంద్రశేఖర్, పలు సంఘాలు, రాజకీయ నాయకులు కె.కాంతయ్య, ఏసురత్నం, కసిరెడ్డి మణికంఠ,పుట్ట లక్ష్మణ్, కె.ధర్మేంద్ర, ఎన్.జ్యోతి, బి.ఎస్.ఆర్.మోహన్‌రెడ్డి, రత్నాకర్, ఎన్.మధుకర్, నాయకులు, తదితరులు నివాళులర్పించారు.

హిమాయత్‌నగర్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో బాల మల్లేశ్ పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు, తదితరులు

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 1 : కామ్రేడ్ బాలమల్లేశ్ మృతి పార్టీకి తీరనిలోటని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పేర్కొన్నారు. శంషాబాద్ పట్టణంలో సీపీఐ రాష్ట్ర నాయకుడు బాలమల్లేశ్ శనివారం మృతి చెందిన విషయం తెలిసిందే. సీపీఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం బాలమల్లేశ్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 12 ఏండ్లు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించి పార్టీని ముందుకు నడిపించారాని, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండి ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రామస్వామి, కార్యవర్గ సభ్యులు ప్రభులింగం, యాదగిరి, ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్న అనంతగిరి శివాలయంలో..

అత్తాపూర్ డివిజన్ రాంబాగ్‌లోని చిన్న అనంతగిరి శివాలయంలో భక్తులు కార్తిక మాసం పూజలు చేశారు. ప్రణవ భక్త సమాజం ఆధ్వర్యంలో శివుడికి అభిషేకం, ఆకాశ దీపం వెలిగించి ఉమామహేశ్వరి మాతకు హారతి పూజలు చేపట్టారు. కార్తిక మాసం చివరి ఆదివారం కావడంతో భక్తులు ఉదయం నుంచే పోటెత్తారు. పూజల్లో నారగూడెం మల్లారెడ్డి పాల్గొన్నారు.

- మైలార్‌దేవ్‌పల్లి

పార్కింగ్ విషయంలో గొడవ, దాడి

ఎర్రగడ్డ, డిసెంబర్ 1: ద్విచక్ర వాహనం పార్కింగ్ విషయంలో ఇద్దరు వ్యక్తుల మధ్య గొడవ చోటుచేసుకున్నది. ఈ సంఘటన బోరబండ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరాంనగర్ సమీపంలోని గంగానగర్‌లో తాహెర్ అనే వ్యక్తి శనివారం రాత్రి తన ద్విచక్ర వాహనాన్ని సాజిద్ ఇంటి ముందు పార్కింగ్ చేశాడు. దీంతో కోపోద్రిక్తుడైన సాజిద్.. తాహెర్‌తో వాగ్వాదానికి దిగాడు. విషయం తెలుసుకున్న సాజిద్ సోదరుడు ఇబ్రహీం, ఇద్దరు స్నేహితులతో కలిసి అక్కడికి చేరుకున్నాడు. వారంతా తాహెర్‌పై దాడి చేసి గాయపర్చారు. సయోధ్య కుదుర్చటానికి మధ్యలో వచ్చిన తాహెర్ తల్లిపై కూడా దాడికి ప్రయత్నించారు. దీంతో బాధితుడు తాహెర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా..కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

4న ఘంటసాల జయంతి

రవీంద్రభారతి, డిసెంబర్ 1 : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, సీల్‌వెల్ కార్పొరేషన్, శ్రుతిలయ పౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీ సాయంత్రం 4.30కు రవీంద్ర భారతిలో ఘంటసాల 102వ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ బండారు సుబ్బారావు, బొక్క భీంరెడ్డి, గాయని ఆమని ఒక ప్రకటనలో తెలిపారు. గాయని శైలజకు ఘంటసాల జీవన సాఫల్యపురస్కారం బహూకరణ కార్యక్రమం ఉంటుందని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి సీతక్క. కోలేటి దామోదర్ గప్తా, సుద్దాల అశోక్‌తేజ హాజరవుతారని తెలిపారు. అనంతరం గాయని అమని బృందంచే సీల్‌వెల్ సుస్వరాలు 66 కార్యక్రమం ఉంటుందని అన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా

చిక్కడపల్లి : వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాత్ర ఉందని టీజీఎస్‌పీడీసీఎల్ మెట్రో జోన్ సీజీఎం చక్రపాణి అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ముషీరాబాద్ ఏఈ బి.శాంతారావు పదవీ విరమణ సభను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీజీఎం చక్రపాణి మాట్లాడుతూ.. అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు సంస్థ, ప్రజల్లో గుర్తింపు ఉంటుందన్నారు. సంస్థలో 36 ఏండ్లు దిగ్విజయంగా పూర్తి చేసుకుని పదవీ విరమణ చేసిన శాంతారావు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సంస్థ సెంట్రల్ సర్కిల్ ఎస్ఈ వెంకన్న మాట్లాడుతూ.. పూరిగుడిసె నుంచి భవనాల వరకు అందరి ఇండ్లలో వెలుగును నింపె సంస్థ విద్యుత్ సంస్థ అన్నారు. అనంతరం శాంతారావు దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అజామాబాద్ డీఈ కమాల్‌కుమర్, ఏడీలు వినోద్‌కుమార్, శ్రీనివాస్, శీనయ్య, 1104 విద్యుత్ ఉద్యోగుల యూనియన్ పి.ప్రవీణ్‌కుమార్, కార్యదర్శి డీఎం ప్రభాకర్, రిజినల్ ప్రెసిడెంట్ జంజిరెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు

నూతన మోటర్‌ను బిగిస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు టీఎన్ శ్రీనివాస్

కంటోన్మెంట్, డిసెంబర్ 1: తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపడుతున్నట్టు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు టీఎన్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం రెండో వార్డు అన్నానగర్ మైసమ్మ ఆలయం వద్ద పవర్ బోర్‌వెల్‌కు బోర్డు అధికారులు కొత్త మోటార్‌ను ఇచ్చారు. దీంతో స్థానిక నేతలతో కలిసి ఆయన బిగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన మోటార్ బిగించడంతో ప్రజల నీటి అవసరాలు తీర్చామని తెలిపారు. ఆదేవిధంగా రెండో వార్డులో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించనున్నట్టు చెప్పారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ డైరెక్టర్ దేవులపల్లి శ్రీనివాస్, బీఆర్ఎస్ రెండో వార్డు అధ్యక్షుడు కుమార్‌ముదిరాజ్, నేతలు శ్యామ్‌రెడ్డి, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక వైద్యశాలలో చికిత్స పొందుతున్న వ్యక్తి అదృశ్యం

ఎర్రగడ్డ, డిసెంబర్ 1: మానసిక వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన బోరబండ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. బల్కంపేటకు చెందిన వి.నర్సింగ్‌రావు (54) అదే ప్రాంతంలో మెడికల్ షాప్‌ను 10 ఏండ్లుగా నిర్వహిస్తూ.. నష్టంరావడంతో మానసిక వేదనకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు అతడిని ఎర్రగడ్డ మానసిక వైద్యశాలలో చికిత్స అందిస్తున్నారు. చికిత్స నిమిత్తం అతడిని గత నెల 18న మానసిక వైద్యశాలలో చేర్పించారు. అతనికి తోడుగా భార్య లావణ్య ఉంది. ఆదివారం ఉదయం లావణ్య బ్రష్ చేసుకునేందుకు వైద్యశాలలోని వాష్‌రూంలోకి వెళ్లి.. తిరిగొచ్చేసరికి నర్సింగ్‌రావు కన్పించలేదు. వైద్యశాల ప్రాంగణంతో పాటు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో నర్సింగ్‌రావు సోదరుడు శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైల్లో దొంగతనం

కాచిగూడ : పుదుచ్చేరి రైల్లో ప్రయాణికుని బైనాక్యూలర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. కొత్తపేటలోని ఆర్‌కే పురం ప్రాంతానికి చెందిన ప్రవీణ్ కుమార్ సీసీఎంబీలో రిసెర్చ్ స్కాలర్. పుదుచ్చేరి రైల్లో ఆదివారం కాచిగూడ రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. బ్యాగు చూసుకునేసరికి బైనాక్యూలర్ కన్పించలేదు. ఆదివారం కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడురు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధుడు మృతి

కాచిగూడ : అనారోగ్యంతో రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వృద్ధుడు(60) శివరాంపల్లి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం-2లో అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుని ఒంటిపై లేత పసుపు రంగు చొక్కా, నలుపు రంగు ట్రాక్ ప్యాంట్ ధరించి, ఎత్తు 5.2 ఉన్నట్లు పేర్కొన్నారు. కేసును కాచిగూడ రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చాట్ల శ్రీరాములు ప్రతిభా పురస్కారానికి ఎస్.కె. మిశ్రో

- 5న తెలుగు వర్సిటీలో మిశ్రోకు రూ. 20వేల నగదుతో పాటు పురస్కారం ప్రదానం

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేవీ రమణాచారి

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 1: ప్రఖ్యాత రంగస్థల, టీవీ, చలనచిత్ర నటుడు, దర్శకుడు ఎస్.కె. మిశ్రో నాటకరంగానికి చేసిన కృషికి గాను చాట్ల శ్రీరాములు పేరిట నెలకొల్పిన ప్రతిభా పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, రసరంజని అధ్యక్షుడు డాక్టర్ కె.వి. రమణాచారి వెల్లడించారు. రెడ్‌హిల్స్‌లోని రమణాచారి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్యక్రమం ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమణాచారి మాట్లాడుతూ.. రసరంజని, చాట్ల శ్రీరాములు థియేటర్ ట్రస్టు ఆధ్వర్యంలో చాట్ల శ్రీరాములు 93వ జయంతి వేడుకలు పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో డిసెంబర్ 5న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాటకరంగమే తపస్సుగా భావించిన చాట్ల శ్రీరాములు నిత్య కృశీవలుడని, ఎన్నో అవార్డులు, పురస్కారాలు అందుకుని నాటకరంగ కళాకారులకు మార్గదర్శకంగా నిలిచారని గుర్తు చేశారు. చాట్ల శ్రీరాములు సంకల్పం మేరకు 1999నుంచి ప్రతి ఏటా నాటక రంగ విశిష్టునికి రూ.20వేల నగదుతో సత్కరించే సంప్రదాయం కొనసాగుతుందని అన్నారు. ఈ సంవత్సరం ఎస్.కె మిశ్రోను ఈ అవార్డుకు కమిటీ సభ్యులు ఎంపిక చేశారని ఈ నెల 5న పురస్కారాన్ని ప్రదానం చేసి ఘనంగా సత్కరించనున్నట్లు వివరించారు. సమాజంలోని సమస్యలకు అద్దంపట్టే అంశాలతో యువభేరి థియేటర్ నిర్వహణలో నా శత్రువు నాటికను ఈ సందర్భంగా పలువురు నటీనటులు వేదికపై ప్రదర్శిస్తారని రసరంజని కార్యదర్శి కేతినీడి నటరాజు తెలిపారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు రామకోటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు అరుణ్‌కుమార్, నారాయణ స్వామి పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 1 : మహిళ అదృశ్యమైన ఘటన ఆదివారం శంషాబాద్ ఆర్‌జీఐఏ పీఎస్ పరిధిలో జరిగింది. సీఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం..ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన కుమారస్వామి అతడి భార్య మౌనిక, ఇద్దరు పిల్లలలో శంషాబాద్ పట్టణంలోని వెల్లంకి నగర్‌లో ఉంటున్నారు. కుమారస్వామి రోజువారి కూలీ కాగా.. భార్య మాత్రం ఇంట్లో ఉంటుంది. గత శుక్రవారం(రెండురోజులు)క్రితం భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో ఇద్దరు పిల్లలను వదిలి ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. సాయంత్రం ఇంటికి వచ్చిన భర్తకు భార్య కనిపించక పోవడంతో చుట్టుపక్కల వెతికాడు. ఆచూకీ తెలియక పోవడంతో ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

రహదారులకు మరమ్మతులు చేపట్టండి

అధికారులను ఆదేశించిన మాజీ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి

రోడ్డు పనులు చేయించాలని మాజీ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డిని కోరుతున్న పీఏసీఎస్ వైస్ చైర్మన్, మాజీ సర్పంచుల బృందం

మహేశ్వరం : అధ్వానంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేయించాలని మాజీ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్ద గోల్కొండ నుంచి కోల్ల పడకల్ పోయో రెండు లైన్ల రోడ్డుకు మరమ్మతులు చేయించాలని పీఏసీఎస్ వైస్ చైర్మన్ దేవరపల్లి వెంకటేశ్వర రెడ్డి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు గాదె థామస్ రెడ్డి, మాజీ సర్పంచులు బండారు లింగం ముదిరాజ్, మంత్రి రాజేష్, రంగారెడ్డి జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎంఎ సమీర్, రమేష్, మల్లేష్, శ్రీకాంత్ తదితరులు ఎమ్మెల్యేను కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రజా ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. రోడ్డు పనులు చేయించాలని ఆదేశాలు జారీ చేశారు. రోడ్లు అస్తవ్యస్తంగా ఉంటే ఎలా ప్రయాణం చేస్తారని ప్రశ్నించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని పనులు చేపట్టాలన్నారు.

కార్తిక మాసం సందర్భంగా తిరుపతిలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలలో ఆదివారం నాంపల్లి విజయనగర్ కాలనీకి చెందిన సంగీత గురువు విజయమూరి లక్ష్మి తన శిష్యబృందంతో భక్తి సంగీత కచేరి నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమయ్య, త్యాగరాజ రచనలలోని పలు కృతులు, వర్ణాలను గానం చేసి సంగీత ప్రియులను అలరించారు.

– తెలుగు యూనివర్సిటీ

సాయిబాబా ఆలయంలో.. గణపతి సహస్రాభిషేకం

మలక్‌పేట : కార్తిక మాసం చివరిరోజు అమావాస్యను పురస్కరించుకొని పాత మలక్‌పేట డివిజన్‌లోని మున్సిపల్ కాలనీ సాయిబాబా ఆలయంలో ఆదివారం గణపతి సహస్రాభిషేకాన్ని నిర్వహించారు. అయ్యప్ప స్వాముల ఆహ్వానం మేరకు వందమంది బ్రాహ్మణులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పూజలు నిర్వహించారు. అభిషేక సమన్వయకర్త వినోద్‌కుమార్ మహావాది ఆధ్వర్యంలో వేద పండితులు రఘు కిశోర్, రమణ ప్రసాద్, శ్యాం ప్రసాద్, పల్లి మనోహర్, విఠల్, గిరిలు గణపతి సహస్ర రుద్ర నమకం, చమకం, శ్రీ సూక్త పురుష సూక్త, దేవీ సూక్త, మన్యు సూక్త, దశ శాంతులతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అథర్వ శీర్ష పఠనాన్ని గావించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను అందించడానికి ఎంఐఎం నిరంతరం పనిచేస్తుందని కార్పొరేటర్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. ఆదివారం టోలిచౌకి హకీంపేట్‌లలో రూ.11,47 లక్షల విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌లను ఎమ్మెల్యే అందించారు.

– మెహిదీపట్నం

అదుపుతప్పిన కారు.. ట్రాఫిక్‌ను చక్కదిద్దిన మంత్రి

ఖైరతాబాద్, డిసెంబర్ 1 : వేగంగా వచ్చిన కారు అదుపుతప్పి ఫుట్‌పైకి ఎక్కింది. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా, అటువైపు నుంచి కాన్వాయ్‌తో వెళ్తున్న ఓ మంత్రి స్వయంగా ట్రాఫిక్‌కు క్రమబద్ధీకరించారు. ఈ ఘటన సైఫాబాద్ పీఎస్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే..ట్యాంక్‌బండ్ వైపు నుంచి ఓ కారు వేగంగా దూసుకువచ్చింది. అదుపుతప్పి అంబేద్కర్ విగ్రహం ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్ పైకి ఎక్కింది. ఆ సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అదే సమయంలో ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి కాన్వాయ్‌తో వెళ్తున్న మంత్రి శ్రీధర్ బాబు వాహనం దిగి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మంత్రి వ్యక్తిగత సహాయకులు ట్రాఫిక్ పోలీసులకు సమాచారం అందించగా, వారు కారు అక్కడి నుంచి తరలించారు.